

శిల్పకళలో రాణిస్తున్న సీతారాం
పిట్టబొంగరం గ్రామానికి చెందిన శిల్పకళాకారుడు సీతారాం శిలలపై శిల్పాలు చెక్కుతున్నాడు. అద్భుత కళాఖండాలు తీర్చిదిద్దుతూ అందరితో ఔరా..! అనిపిస్తున్నాడు. 8లో▸



పత్తిసాగులో నూతన ఒరవడి
కొల్హారీ గ్రామ రైతులు నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. మల్చింగ్, అమృత్ ప్యాటర్న్ విధానంలో పత్తి సాగు చేస్తూ అధిక దిగుబడి సాధిస్తున్నారు. 9లో▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
26.0/23.0
ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

పీహెచ్‌సీ పరిశీలన



సిబ్బందితో మాట్లాడుతున్న బృందం సభ్యులు

తాంసి: మండల కేంద్రంలోని పీహెచ్‌సీని గురువారం నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్ (ఎన్‌క్వాస్) బృందం పరిశీలించింది. పీహెచ్‌సీకి ఎన్‌క్వాస్ గుర్తింపులో భాగంగా బృందం సభ్యులు డాక్టర్ వైశాలి, డాక్టర్ ఆనంది భిక్షిత్ బుధవారం ఆరోగ్య కేంద్రంలో వసతులు, రోగులకు అందిస్తున్న సేవలు పరిశీలించారు. రెండోరోజు వైద్యసిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమై రోగుల వివరాలు, గర్భిణులకు అందిస్తున్న సేవల వివరాలు తెలుసుకుని నమోదు చేసుకున్నారు. వివరాలు ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు. జిల్లా మలేరియాధికారి శ్రీధర్, తాంసి వైద్యాధికారి శ్రావ్య, నర్మద, సూపర్‌వైజర్ తులసీరాం, ఫార్మసిస్ట్ ఇక్బాల్, స్టాఫ్‌నర్స్ మేఘ, సంపత్‌కుమారి, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలున్నారు.

కార్మికుల సంక్షేమానికి నిరంతర పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న విలాస్

ఇచ్చోడ: కార్మికుల సంక్షేమానికి ఏఐటీయూసీ నిరంతర పోరాటం చేస్తోందని రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏఐటీయూసీ, భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో లేబర్ రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులంతా సంఘటితమై హక్కుల సాధన కోసం చేసే పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి గాజంగుల రాజు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సిర్ర దేవేందర్, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ జగదీశ్వర్‌రెడ్డి, సంఘం జిల్లా అధ్యక్షుడు రేణిగుంట సురేశ్, ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, సర్పంచ్ చౌహాన్‌సునీత తదితరులున్నారు.

నేడు సర్వాయి పాపన్నగౌడ్ జయంతి

కైలాస్‌నగర్: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 18వ తేదీన ఉదయం 11గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని గౌడ కులస్తులు, బీసీలు, బీసీ సంఘాల ప్రతినిధులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

'భూ కబ్జాదారులకు అడ్డాగా మున్సిపాలిటీ'



మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపాలిటీ భూకబ్జాదారులకు అడ్డాగా మారిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ ఆరోపించారు. పట్టణంలోని కేఆర్కే కాలనీలో 2009 నుంచి నివాసముంటున్న ఓ వ్యక్తి ప్లాట్‌ను మరొకరి పేరిట డోర్ నంబర్ కేటాయిస్తూ బల్దియా సిబ్బంది ఇంటిని కూల్చివేయడాన్ని నిరసిస్తూ గురువారం కలెక్టర్ చాంబర్ ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. మున్సిపల్ కమిషనర్ శైలజతో వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. ల్యాండ్ మాఫియాకు చెందిన అధికార పార్టీ చోటామోటా నాయకులు పేదల సొంత ప్లాట్లకు మున్సిపాలిటీలో అక్రమంగా డోర్ నంబర్లు తీసుకుని దొడ్డిదారిన రిజిస్ట్రేషన్లు చేసుకుంటూ అమ్ముకుంటున్నారని ఆరోపించారు. కేఆర్కే కాలనీలో బుడగజంగాలకు చెందిన రమేశ్ 2009 నుంచి నివసిస్తుండగా మరోవర్గానికి చెందిన ఓ వ్యక్తి పేరిట డోర్ నంబర్ కేటాయిస్తూ మున్సిపల్ సిబ్బందితో ఆ ఇంటిని కూల్చివేయించడం అధికారుల దుర్మార్గానికి నిదర్శనమన్నారు. సర్వే నంబర్ 170లోని ఏడెకరాల భూమిని అధికార పార్టీ నాయకులు కబ్జా చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, మున్సిపల్ అధికారులు రియల్ ఎస్టేట్ మాఫియాకు ఆట బొమ్మలుగా మారారని ఆరోపించారు. అనంతరం కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ 24 గంటల్లోపు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.



టికెట్ గుబులు

- ఆయా పార్టీల ఆశావహుల్లో టెన్షన్
- నిత్యం జనాల వద్దకు పరుగులు
- అధిష్టానం దృష్టిలో పడే యత్నం
- సోషల్ మీడియాలో 'లిస్ట్' పోస్టులు!
- 'ఫేక్' అని కొట్టిపారేస్తున్న నేతలు
- నియోజకవర్గాల్లో ఎన్నికల గాలి..!

సాక్షి, ఆదిలాబాద్: ఆయా రాజకీయ పార్టీల ఆశావహుల్లో 'మొదటి జాబితా' టెన్షన్ మొదలైంది. ఎమ్మెల్యే అభ్యర్థులను ఖరారు చేస్తూ విడుదల చేసే ఫస్ట్ లిస్ట్‌లో తమ పేరుంటుందో.. లేదోనని నేతలు గుబులు చెందుతున్నారు. ఒకవేళ నియోజకవర్గానికి సంబంధించి అసలు ప్రకటనే ఉండకపోతే పరిణామాలు ఎలా?.. ఇలాంటి మీమాంస ఆశావహుల్లో నెలకొంది. ఎన్నికలు సమీపిస్తుండగా రాజకీయ పార్టీలు ఫస్ట్ లిస్ట్ సిద్ధం చేస్తున్నాయన్న ప్రకటన ఈ కలవరానికి కారణమైంది. మరోపక్క సోషల్ మీడియాలో ఏకంగా వివిధ పార్టీల అభ్యర్థుల పేర్లతో కూడిన పోస్టులు చక్కర్లు కొడుతున్నాయి.

అంతటా కోలాహలం..

అధికార బీఆర్‌ఎస్ మొదటి జాబితా త్వరలో విడుదలయ్యే అవకాశం ఉందని పార్టీలో ప్రచారం సాగుతోంది. సిట్టింగ్ ఎమ్మెల్యేలకే టికెట్లు కేటాయిస్తారా?.. లేదా సర్వే రిపోర్టులను ప్రామాణికం చేసుకుని ఏవైన మార్పులు.. చేర్పులు చేస్తారా? అనేది ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే పలు ప్రైవేట్ సర్వేలతో పాటు ఇంటెలిజెన్స్ సర్వేలు అధిష్టానానికి చేరడంతో మొదటి జాబితా విషయంలో సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో ఆత్రుత నెలకొంది. టికెట్ ఆశిస్తున్న అసమ్మతి, ఆశావహుల్లో ఉత్కంఠ కనిపిస్తోంది. ఆయా నియోజకవర్గాల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేయాలనుకుంటున్న నేతల నుంచి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో శుక్రవారం ప్రారంభించనున్నారు. దీంతో టికెట్ ఆశిస్తున్న ముఖ్య నేతలంతా దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. బీజేపీలో ఫస్ట్ లిస్ట్‌పై ఇంకా ఒక క్లారిటీ రానట్టు తెలుస్తోంది.

జనాల్లో ఉండేందుకు తంటాలు..

ఆయా నియోజకవర్గాల నుంచి టికెట్ ఆశిస్తున్న నేతలు జనాల్లో ఉండేందుకు తంటాలు పడుతున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ప్రధానంగా ఆయా నియోజకవర్గాల్లోని మండలాల్లో నిత్యం పర్యటిస్తూ ప్రజలను కలుస్తున్నారు. అధికార పార్టీలో సిట్టింగ్ ఎమ్మెల్యేలతో పాటు ఆశావహులు పర్యటిస్తున్నారు. కొన్నిచోట్ల అధిష్టానం ఆయా నాయకులను జనాల్లో ఉండాలని సూచించడంతో వారు అలాగే ముందుకెళ్తున్నారు. గ్రేడింగ్ ఆధారంగా ఎవరికి ఎక్కువ మార్కులు వస్తే వారికే టికెట్ అనే సంకేతాలు ఉండడంతో కొన్ని నియోజకవర్గాల్లో తీవ్ర పోటీ కనిపిస్తోంది. కాగా, జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్నవారు విస్తృతంగా పర్యటిస్తున్నారు. బీజేపీలోనూ ఇదే పరిస్థితి ఉంది. ఆయా పార్టీల ఆశావహుల్లో ఫస్ట్ లిస్ట్ టెన్షన్ కనిపిస్తుండగా.. ఏ పార్టీ ఎవరికి టికెట్ కేటాయిస్తుందోననే ఉత్కంఠ ప్రజల్లో నెలకొంది.

కలవరపెడుతున్న 'సోషల్' పోస్టులు

ఆయా పార్టీల మొదటి జాబితా విడుదల విషయం ఎలా ఉన్నా.. ఆ జాబితాలో వీరివీరి పేర్లున్నాయంటూ సోషల్ మీడియాలో పోస్టులు చక్కర్లు కొడుతున్నాయి. బీఆర్‌ఎస్ మొదటి జాబితా ఇది.. బీజేపీ ఫస్ట్ లిస్ట్‌లోని పేర్లివి.. కాంగ్రెస్ నుంచి టికెట్ దక్కేది వీరికే.. అని పోస్టులు వైరల్ అవుతున్నాయి. అయితే ఆయా పార్టీల మొదటి జాబితా విడుదలైతేనే గాని ఏయే పార్టీ నుంచి ఎవరెవరు అభ్యర్థులు.. అనే విషయం స్పష్టమయ్యే అవకాశముంది. గురువారం నిర్మల్ జిల్లా కేంద్రానికి వచ్చిన బీజేపీ రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న తమ పార్టీ అభ్యర్థుల జాబితా అంతా ఫేక్ అని స్పష్టం చేశారు. ఫస్ట్ లిస్ట్ సిద్ధమవుతోందని పేర్కొన్నారు. మొత్తంగా రాజకీయ పార్టీల్లో మొదటి జాబితా కోలాహలం కనిపిస్తోంది.

వీధి వ్యాపారులకు షెడ్లు



డైట్ కళాశాలను ఆనుకుని షెడ్లు నిర్మించే ప్రాంతం

- 80 నిర్మాణాలకు బల్దియా తీర్మానం
- మొదట 57 షెడ్ల పనులు ప్రారంభం
- పక్షంరోజుల్లో అందుబాటులోకి..

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలో వీధి వ్యాపారుల ఉపాధికి భరోసా కల్పించేలా మున్సిపల్ యంత్రాంగం చర్యలు చేపట్టింది. స్థానిక వినాయక్‌చౌక్ నుంచి తెలంగాణచౌక్ మార్గంలో అటవీశాఖ కార్యాలయం నుంచి డైట్ కళాశాల వరకు రూ.28లక్షలతో షెడ్ల నిర్మాణం చేపడుతోంది. ఇప్పటికే 80 షెడ్ల నిర్మాణానికి టెండర్లు ఖరారయ్యాయి. ఇందులో డైట్ కళాశాల వద్ద నిర్మిస్తున్న 57 షెడ్లకు సంబంధించిన స్థలానికి పట్టణ ప్రణాళిక విభాగం క్లియరెన్స్ ఇవ్వగా పనులు ప్రారంభమయ్యాయి. అటవీశాఖ కార్యాలయ స్థలానికి సంబంధించి ప్రణాళిక విభాగంలో పెండింగ్‌లో ఉండడంతో మిగతావి త్వరలో ప్రారంభించనున్నారు. ఈ నెలాఖరు వరకు పూర్తిచేసి సెప్టెంబర్ మొదటి వారంలో అందుబాటులోకి తీసుకువస్తామని అధికారులు చెబుతున్నారు.

తప్పనున్న ట్రాఫిక్ తిప్పలు

పట్టణంలో రోడ్లపైనే వ్యాపారాలు చేస్తుండడంతో ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. ఎండ, వానలకు కూడా వ్యాపారులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. వీరి ఇబ్బందులను తొలగించాలనే ఉద్దేశంతో సాత్నాల బస్టాండ్, ఓల్డ్ బస్టాండ్ ప్రాంతాల్లో షెడ్లు నిర్మించి ఇవ్వడంతో కొంత సమస్య తీరింది. ఈ షెడ్లకు ఒక్కోదానికి రూ.వెయ్యి చొప్పున అద్దె వసూలు చేయాలని మున్సిపల్ అధికారులు నిర్ణయించగా, కౌన్సిలర్ల నుంచి వ్యతిరేకత వచ్చింది. దీంతో రూ.500కు తగ్గించి వసూలు చేస్తున్నారు. ఇప్పటివరకు 125 షెడ్లు నిర్మించగా.. తాజాగా మరో 80 షెడ్లు నిర్మించేందుకు మున్సిపల్ యంత్రాంగం నిర్ణయించింది.

ఈ సారైనా అర్హులకు దక్కేనా?

గతంలో నిర్మించిన షెడ్లను చాలామంది అనర్హులకు కేటాయించారనే ఆరోపణలున్నాయి. ఏళ్ల నుంచి వ్యాపారాలు చేసుకుంటున్న వారిని కాదని అనర్హులకు కట్టబెట్టారనే విమర్శలు వచ్చాయి. కొందరు రెండు, మూడు షెడ్లను కలుపుకొని వ్యాపారం కొనసాగిస్తుండడంతో ఇందులో అక్రమాలు జరిగినట్లు స్పష్టమవుతోంది. రాజకీయ పలుకుబడితో షాపులను దక్కించుకున్న మరికొంతమంది వాటిని రూ.1,500 నుంచి రూ.2వేల వరకు అద్దెకిస్తున్నట్లు వ్యాపారవర్గాల్లో చర్చ సాగుతోంది. బల్దియాలో పెత్తనం చెలాయిస్తున్న ఓ ద్వితీయస్థాయి నాయకుడు అక్రమంగా డబ్బులు వసూలు చేసి తమ వారికే షెడ్లు దక్కేలా చక్రం తిప్పినట్లు అధికార పార్టీ కౌన్సిలర్లే బహిరంగ విమర్శలు గుప్పించడం అప్పట్లో తీవ్ర చర్చనీయాంశమైంది. తాజాగా చేపట్టిన ఈ షెడ్లపై కూడా సదరు నాయకుడు కన్నేసినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే బల్దియా అధికారులు ఈ సారైనా అక్రమాలకు తావివ్వకుండా పకడ్బందీగా సర్వే చేసి అర్హులకు కేటాయిస్తారా? లేక.. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి మరోసారి అక్రమార్కులకు అప్పగిస్తారా? అనే చర్చ వ్యాపార వర్గాల్లో జోరుగా సాగుతోంది.

త్వరలో నిర్మాణ పనులు పూర్తి

వీధి వ్యాపారుల ఉపాధికి అండగా ఉండాలనే ఉద్దేశంతో పట్టణంలో 80 షెడ్ల నిర్మాణాలకు మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం చేసింది. ఇందుకు రూ.28 లక్షలతో టెండర్లు పిలిచి ఖరారు చేశాం. పట్టణ ప్రణాళిక విభాగం క్లియరెన్స్ రావడంతో ప్రభుత్వ డైట్ కళాశాల ప్రహరీని ఆనుకుని 57 షెడ్ల నిర్మాణ పనులను కాంట్రాక్టర్ ప్రారంభించారు. ఈ నెలాఖరు వరకు పనులు పూర్తి చేసి వచ్చే నెల మొదటివారంలో అందుబాటులోకి తీసుకువస్తాం. అక్రమాలకు తావివ్వకుండా కలెక్టర్ ఆదేశాల మేరకు అర్హులకే షెడ్లు కేటాయిస్తాం.
– ఏ శైలజ, మున్సిపల్ కమిషనర్

ఇళ్లు ఇచ్చేదాకా ఉద్యమిస్తాం



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పాయల్ శంకర్, నాయకులు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్
- తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

ఆదిలాబాద్‌రూరల్: పేదలకు డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇచ్చేదాకా ఉద్యమిస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ పేర్కొన్నారు. పేదలకు ఇళ్లు ఇవ్వాలని గురువారం మావల తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హామీ ఇచ్చి తొమ్మిదేళ్లయినా పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. వెంటనే పేదలకు ఇళ్లు ఇవ్వకుంటే రాబోయే రోజుల్లో ఎమ్మెల్యే జోగు రామన్న ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. నాయకులు రవిరెడ్డి, అంకత్ రమేశ్, వేణుగోపాల్, లోక ప్రవీణ్‌రెడ్డి, జోగు రవి, చిలుకూరి జ్యోతిరెడ్డి, గంగారెడ్డి, సోమ రవి, మహేందర్, భీంసేన్‌రెడ్డి, ధోనిజ్యోతి, ముకుంద్‌రావ్, గోపీ తదితరులున్నారు.

ఇళ్లు ఇవ్వాలనే చిత్తశుద్ధి లేదు

'గృహలక్ష్మి' దరఖాస్తు గడువు మూడురోజులే ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వానికి పేదలకు ఇళ్లు ఇవ్వాలనే చిత్తశుద్ధి లేదని డీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు భూపెల్లి శ్రీధర్ ఆరోపించారు. మావల మండలం వాఘపూర్ పంచాయతీ పరిధి కొలాంగూడలో ఇళ్లు లేని పేదలతో సమావేశమై మాట్లాడారు. గృహలక్ష్మి పథకం మార్గదర్శకాలను సడలించి లబ్ధిదారుల ఎంపికను కలెక్టర్ కనుసన్నల్లోనే జరిపించాలని కోరారు.

జీవించినంత కాలం కాంగ్రెస్‌లోనే..

- డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్

ఎదులాపురం: జీవించినంత కాలం తాను కాంగ్రెస్‌లోనే ఉంటానని డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ స్పష్టం చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని సీసీఆర్ నివాసంలో విలేకరులతో మాట్లాడారు. సోషల్ మీడియా వేదికగా తాను బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్లు వస్తున్న ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదన్నారు. 'అసలైన కార్యకర్త అవసరమైతే ప్రజల కాళ్లు మొక్కాలి' అని తానన్నమాటలను ఎడిట్ చేసి దుష్ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. ఇవి ఎవరు చేయిస్తున్నారో.. ఎందుకు చేయిస్తున్నారో.. తనతోపాటు స్థానిక ప్రజలకు తెలుసని చెప్పారు. డబ్బుందనే అహంకారంతో కొందరు నేతలు ఇలాంటి పనికిమాలిన ప్రచారం చేస్తున్నారని, ఇకనైనా ఇలాంటివి మానుకోవాలని హితవు పలికారు. టికెట్ ఎవరికి వచ్చినా అధిష్టానం నిర్ణయం మేరకు కట్టుబడి పని చేస్తానని చెప్పారు. కంది శ్రీనివాస్‌రెడ్డి సస్పెన్షన్ రద్దు చేసి ఆయనకు టికెట్ ఇచ్చినా పార్టీ గెలుపుకోసం పని చేస్తానని పేర్కొన్నారు. కంది శ్రీనివాస్ రెడ్డి కూడా అందరిని కలుపుకొని పని చేయాలని సూచించారు. ఆయన వెంట నాయకులు నగేశ్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సాజిద్‌ఖాన్

బోపాల్‌కు వెళ్లిన ఆదివాసీ కళాకారులు



ప్రదర్శన ఇవ్వనున్న ఆదివాసీ కళాకారులు

ఇచ్చోడ: మండలంలోని దూబార్‌పేట్ గ్రామానికి చెందిన ఆదివాసీ కళాకారులు గురువారం బోపాల్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా ఆదివాసీ సకల కళాసంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తానుబాయి, ప్రధాన కార్యదర్శి కాత్లె శ్రీధర్ మాట్లాడారు. మధ్యప్రదేశ్‌లోని బోపాల్‌లో ఈ నెల 18నుంచి 20వ తేదీవరకు కళాప్రదర్శన ఇవ్వడానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి 12మంది ఆదివాసీ కళాకారులు వెళ్తున్నట్లు తెలిపారు. జన్ జాతీయ సంగ్రాలయ్‌లో నినాద్ సమారోహ్ కార్యక్రమంలో వీరు కాలికోమ్, పెప్రే, డప్పు, గుస్సాడీ నృత్యాలలో ప్రదర్శన ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ బృందానికి తాను సారథ్యం వహిస్తున్నట్లు కాత్లె శ్రీధర్ ఈ సందర్భంగా తెలిపారు.

సంపదవనం పరిశీలన



వడ్డాడిలో వనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

తాంసి: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని వడ్డాడి గ్రామంలో ఏర్పాటు చేసిన సంపద వనాన్ని రాష్ట్ర తనిఖీ బృందం సభ్యులు గురువారం పరిశీలించారు. మొక్కలను సంరక్షించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర రీజినల్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ సత్తయ్య, జూనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి మహేందర్, పీడీ కిషన్‌తో కలిసి మొక్కలు, రక్షణ చర్యల గురించి తెలుసుకుని నమోదు చేసుకొన్నారు. వారి వెంట ఏపీడీ కృష్ణారావు, జిల్లా ప్లాంటేషన్ అధికారి సూర్యప్రకాశ్, ఎంపీడీవో భూమయ్య, ఏపీవో విజయ, సర్పంచ్ శ్రీనివాస్, ఉపసర్పంచ్ షైమీర్, టీఏ రాజన్న తదితరులున్నారు.

మద్యం షాపులకు దరఖాస్తుల వెల్లువ

- 40 షాపులకు 448 దరఖాస్తులు
- నేటితో ముగియనున్న గడువు

ఆదిలాబాద్‌టౌన్: నిన్నటి వరకు మందకొడిగా సాగిన మద్యం దుకాణాల దరఖాస్తు ప్రక్రియ ఊపందుకుంది. అధిక మాసం కారణంగా దరఖాస్తుదారులు ముందుకు రాకపోగా, గురువారం శ్రావణ మాసం ప్రారంభం కావడంతో దరఖాస్తులు వెల్లువెత్తాయి. జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్‌శాఖ కార్యాలయం దరఖాస్తుదారులతో కిటకిటలాడింది. 2019–23లో 592 దరఖాస్తులు రాగా, 2023–25లో 700 వరకు రానున్నట్లు అంచనా వేస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తుండడం ఇందుకు కారణంగా తెలుస్తోంది. ఈ రెండేళ్లలో వరుసగా ఎన్నికలు రానుండగా కాసుల వర్షం కురవనుందని వ్యాపారులు భావిస్తున్నారు.

21న లక్కీ డ్రా ద్వారా కేటాయింపు

ఈనెల 21న జిల్లా కేంద్రంలోని రత్నా గార్డెన్స్‌లో కలెక్టర్ రాహుల్‌రాజ్ చేతుల మీదుగా లక్కీడ్రా తీయనున్నారు. వచ్చే ఏడాది నుంచి టెండర్ దక్కించుకున్న వారికి షాపులు కేటాయించనున్నారు. జిల్లాలో 40 షాపులుండగా, ఇప్పటివరకు 448 దరఖాస్తులు వచ్చినట్లు డీపీఈవో హేమశ్రీ తెలిపారు. గురువారం ఆదిలాబాద్ స్టేషన్ పరిధిలోని 18 షాపులకు 100 దరఖాస్తులు రాగా, ఇప్పటివరకు మొత్తం 336 దరఖాస్తులు వచ్చాయి. అలాగే బోథ్ స్టేషన్ పరిధిలో 13 షాపులకు 31 దరఖాస్తులు రాగా, మొత్తం సంఖ్య 66కు చేరింది. ఉట్నూర్ స్టేషన్ పరిధిలో తొమ్మిది షాపులకు 30 దరఖాస్తులు రాగా, వీటి సంఖ్య 46కు చేరింది. జిల్లా వ్యాప్తంగా 448 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ఈనెల 4న ప్రారంభమైన మద్యం షాపుల దరఖాస్తు ప్రక్రియ శుక్రవారం ముగియనుంది. కాగా, చివరి రోజు దరఖాస్తుల సంఖ్య పెరిగే అవకాశమున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

'లక్ష్యాలను చేరకుంటే ఉపేక్షించబోం'

కైలాస్‌నగర్: లక్ష్యాలకు అనుగుణంగా రుణాలు మంజూరు చేయకుంటే ఉపేక్షించబోమని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బ్యాంకర్లతో జిల్లాస్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లాలో రైతుబంధు లబ్ధిదారులు, పంట రుణాలు పొందుతున్న రైతుల వివరాలు ఏడీఏ రమేశ్‌ను అడిగి తెలుసుకున్నారు. జైనథ్ మండలంలో మినహా మిగతా చోట్ల రుణాలు తీసుకుంటున్న, తీసుకోని రైతుల వివరాలు తెలుపకపోవడంతో ఆగ్రహం వ్యక్తంజేశారు. రెండు రోజుల్లోగా వివరాలు అందించాలని ఆదేశించారు. వివిధ శాఖల ద్వారా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు బ్యాంకులు పంట అనుబంధ, ఉపాధి యూనిట్ల స్థాపన, చిన్న, మధ్య తరహా, విద్యా, గృహ, ఇతర ప్రాధాన్యత రుణాలను అర్హులైన పేదలకు మంజూరు చేయాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల రుణాలు సకాలంలో చెల్లించేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మహిళా సంఘాలకు ఇప్పటివరకు రూ.56.38 కోట్లు, 35,623 మంది రైతులకు రూ.207.56 కోట్ల పంట రుణాలను వివిధ బ్యాంకులు అందించాయని తెలిపారు. పాడిపరిశ్రమ, ఉన్నత విద్య, పరిశ్రమల స్థాపన, దివ్యాంగులకు స్వయం ఉపాధి రుణాలు నిబంధనలు మేరకు అందించాలని ఆదేశించారు. రుణాల మంజూరులో వెనుకబడిన బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులపై ఆగ్రహం వ్యక్తంజేశారు. అనంతరం 2023–24 వార్షిక రుణ ప్రణాళిక పుస్తకాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఎల్డీఎం ప్రసాద్, వివిధ బ్యాంకుల మేనేజర్లు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

శిల్పకళలో రాణిస్తున్న సీతారాం

- విగ్రహాల తయారీతో ఉపాధి
- ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపు





నంది విగ్రహం చెక్కుతున్న సీతారాం

ఇంద్రవెల్లి(ఖానాపూర్‌): మండలంలోని పిట్టబోంగరం గ్రామానికి చెందిన శిల్పకళాకారుడు వెట్టి సీతారాం అద్భుతమైన కళాఖండాలను తయారు చేస్తూ అందరిచేత ఔరా అనిపించుకుంటున్నాడు. అతను చదివింది అంతంత మాత్రమే అయినా శిల్పకళలో రాణిస్తూ పలువురి ప్రశంసలు అందుకుంటున్నాడు. గ్రామంలో తనకున్న ఐదెకరాల వ్యవసాయ భూమిని సాగుచేస్తూనే పదిహేనేళ్లుగా విగ్రహాల తయారీతో ఉపాధి పొందుతున్నాడు. ఉమ్మడి జిల్లాలో ఆదరణ ఉన్న జై జంగో.. జై లింగో.. పద్మల్‌పురి కాకో వంటి విగ్రహాలు తయారు చేయడంతో పాటు అంజనేయుడు, వినాయకుడు, ఆదివాసీ ఉద్యమకారుడు కుమురంభీం, బుద్ధుడు, శివలింగం, నంది, అటవీ జంతువులైన నెమళ్ల విగ్రహాలు చెక్కుతున్నాడు.

సైజ్‌ను బట్టి ధర

శిల్పకళాకారుడు సీతారాంకు ఉమ్మడి జిల్లా నుండి విగ్రహాల తయారీకి ఆర్డర్లు బాగానే వస్తున్నాయి.



సీతారాం తయారు చేసిన నెమలి విగ్రహాలు

బండరాయి, సిమెంట్‌తో కూడిన హనుమాన, శివలింగం, నంది, నెమలి, జై జంగో...జై లింగో విగ్రహాలు చెక్కి విక్రయిస్తున్నాడు. విగ్రహం సైజ్‌ను బట్టి ధర ప్రకటిస్తున్నాడు. రూ.2 వేల నుంచి రూ.50 వేల వరకు విగ్రహాలను విక్రయిస్తున్నాడు.

ఆర్థికసాయం కోసం ఎదురుచూపు

ఆదివాసీ నిరుపేద కుటుంబానికి చెందిన సీతారాం వ్యవసాయ చేస్తూనే తనకున్న కళతో విగ్రహాలు తయారు చేసి ఉపాధి పొందుతున్నాడు. కానీ ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థిక సాయం పొందలేదు. సంప్రదా య విగ్రహాల తయారీ కళపై ఆధారపడ్డ తనను విస్మరించి ఉన్నత స్థాయి కళాకారులకు మాత్ర మే ప్రభుత్వం చేయూతనిస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. తన కళను మరింత అభివృద్ధి పరిచేందుకు ఆర్థికసాయంకోసం ఐటీడీఏ చుట్టూ తిరిగినా ఎవరూ పట్టించుకోవడంలేదని వాపోతున్నాడు. ఇప్పటికైనా ఏజెన్సీలో ఉన్న తమలాంటి కళాకారులను ప్రభుత్వం గుర్తించి ప్రోత్సహించాలని కోరుతున్నాడు.

12 సార్లు దరఖాస్తు చేశా



విగ్రహాలు చెక్కడానికి కావాల్సిన యంత్రాలు, పరికరాలు కొనుగోలు చేసేందుకు ఇప్పటి వరకు ఐటీడీఏతో పాటు కేస్లాపూర్‌ నాగోబా జాతరలో ఏర్పాటు చేస్తున్న నాగోబా దర్బార్‌లో 12 సార్లు దరఖాస్తు చేసుకున్నా. దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు ఎలాంటి సాయం అందించడం లేదు. ఐటీడీఏ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా కలెక్టర్‌ దృష్టి సారించి ఐటీడీఏ ద్వారా ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలి.

– వెట్టి సీతారాం, శిల్పకళాకారుడు, పిట్టబోంగరం

కదిలి పాపహరేశ్వరాలయానికి శ్రావణ శోభ



శ్రీమాతాన్నపూర్ణ పాపహరేశ్వరాలయం

దిలావర్‌పూర్‌(నిర్మల్‌): జిల్లాలోనే అత్యంత ప్రాచీన ప్రాశస్త్యం గల శ్రీమాతాన్నపూర్ణేశ్వరి కదిలి పాపహరేశ్వరాలయంలో గురువారం నుండి శ్రావణమాస ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. ఆపరమ శివుని దర్శించుకునేందుకు అధికసంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. గలగలా పారే సేలయేరు..కొండల నడుమ ప్రాచీన శిల్పకళా దర్పణంగా నిలిచిన విగ్రహాలు, పశ్చిమదిశ ముఖద్వారం గల ఆలయం పచ్చని ప్రకృతి నడుమ ఆద్యంతం భక్తులను మంత్రముగ్ధుల్ని చేస్తోంది.

ప్రత్యేక ఏర్పాట్లు

శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని ఆలయంలో నెలరోజుల పాటు నిర్వహించనున్న ప్రత్యేక పూజలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్‌ చైర్మన్‌ నార్వాడి వెంకట్రావు పాటిల్‌, ఎండోమెంట్‌ ఇన్స్‌పెక్టర్‌ రంగు రవికిషన్‌గౌడ్‌ తెలిపారు. ఆలయంలో ప్రత్యేక అభిషేకాలతో పాటు మహిళలు కుంకుమ పూజలు నిర్వహించనున్నారు.

ప్రహరీ కూల్చివేత

నస్పూర్‌: పట్టణ పరిధిలోని 11 వవార్డు ఎఫ్‌సీఐ కాలనీలో రోడ్డుపై అక్రమంగా నిర్మించిన రెడిమేడ్‌ ప్రహరీని గురువారం మున్సిపల్‌ అధికారులు బ్లేడు ట్రాక్టర్‌తో కూల్చి వేయించారు. ఈ సందర్భంగా కమిషనర్‌ రమేశ్‌ మాట్లాడుతూ పట్టణంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఎవరైనా అక్రమ నిర్మాణాలు, చేపడితే చర్యలు తీసుకుంటామన్నారు.

క్లుప్తంగా

ఇరువర్గాలపై కేసు నమోదు

భీమిని: కన్నెపల్లి మండలం మోతుకుపల్లి శివారులోని రెండెకరాల భూమి కేసులో ఇరువర్గాలపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేష్‌ తెలిపారు. కన్నెపల్లి గ్రామానికి చెందిన కామెర శంకర్‌, గురుండ్ల రామకృష్ణ, భుజంగంపై సుల్తానాబాద్‌ గ్రామానికి చెందిన మైదంశెట్టి అంజయ్య, అతని భార్య భూమిని ఆక్రమించుకుంటున్నారని తెలిసిన కన్నెపల్లి గ్రామస్తులు వారి వద్దకు వెళ్లి అడగగా మాటమాట పెరిగి ఘర్షణకు దారి తీసింది. దీంతో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేయగా ఇరువర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గృహహింస కేసులో భర్తకు ఏడాది జైలు

బెల్లంపల్లి: కట్టుకున్న భార్యను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేసిన భర్తకు జడ్జి జైలుశిక్ష విధించినట్లు బెల్లంపల్లి టూటౌన్‌ ఎస్సై ఎస్‌.రవికుమార్‌ తెలిపారు. బెల్లంపల్లి మున్సిపాలిటీలోని సుభాష్‌నగర్‌ బస్తీకి చెందిన షమీనా భర్త ఎండి ముస్తాఫాపాషా అదనపు వరకట్నం తీసుకు రావాలని వేధిస్తున్నాడని 2011లో టూటౌన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి స్టేషన్‌ హౌజ్‌ ఆఫీసర్‌ రవీందర్‌ కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీట్‌ దాఖలు చేశారు. కోర్టు కానిస్టేబుల్‌ ఎండి రహీమొద్దీన్‌ సాక్షులను ప్రవేశ పెట్టగా అసిస్టెంట్‌ పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ అజయ్‌కుమార్‌ వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో గురువారం బెల్లంపల్లి జుడిషియల్‌ ఫస్ట్‌ క్లాస్‌ మెజిస్ట్రేట్‌ ఎస్‌.ముకేష్‌ నిందితునికి ఏడాది సాధారణ జైలు, రూ.3 వేల జరిమానా విధిస్తూ తీర్పుచెప్పినట్లు ఎస్సై తెలిపారు.

గుడుంబా తరలిస్తున్న యువకుడు అరెస్టు



పోలీసుల అదుపులో నిందితుడు

బెల్లంపల్లి: గుడుంబా తరలిస్తున్న ఓ యువకుడిని గురువారం అరెస్టు చేసినట్లు తాళ్లగురిజాల ఎస్సై నరేష్‌ తెలిపారు. పెర్కపల్లి రోడ్డుపై పెట్రోలింగ్‌ నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన లంబాడితండాకు చెందిన ఇస్లావత్‌ రాజేశ్‌ బైక్‌ను ఆపి తనిఖీ చేయగా ఆరు లీటర్ల గుడుంబా పట్టుబడినట్లు ఎస్సై తెలిపారు. వేరే వ్యక్తి వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి తీసుకెళ్తున్నట్లు నిందితుడు పేర్కొన్నాడు. నాటుసారాను స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వదినను చంపుతానని బెదిరించిన మరిదికి జైలుశిక్ష

బెల్లంపల్లి: ఇంట్లోకి వెళ్లకుండా వదినను అడ్డగించి చంపుతానని బెదిరించిన కేసులో మరిదికి బెల్లంపల్లి జుడీషియల్‌ ఫస్ట్‌క్లాస్‌ మెజిస్ట్రేట్‌ గురువారం నెలరోజుల సాధారణ జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధించినట్లు బెల్లంపల్లి వన్‌టౌన్‌ ఎస్‌హెచ్‌వో టి.శంకరయ్య తెలిపారు. పట్టణంలోని బజారు ఏరియాకు చెందిన హరికిషన్‌సార్డా కొంత కాలం క్రితం మృతి చెందాడు. ఆయన మరణాంతరం ఆస్తి కోసం హరికిషన్‌ సార్డా భార్య నిర్మల సార్డాను మరిది బాలకిషన్‌సార్డా వేధింపులకు గురి చేయడం మొదలు పెట్టాడు. దీనిపై బాధితురాలు 2016లో బాలకిషన్‌సార్డా పై వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై గంగరాజ గౌడ్‌ కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్‌దాఖలు చేశాడు.నేరం రుజువుకావడంతో జుడీషియల్‌ ఫస్ట్‌క్లాస్‌ మెజిస్ట్రేట్‌ ఎస్‌.ముకేష్‌ నిందితుడు బాలకిషన్‌ సార్డాకు నెల రోజుల సాధారణ జైలు, రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారని ఎస్‌హెచ్‌ఓ శంకరయ్య తెలిపారు.

బ్యాంకు అధికారుల తీరుపై మహిళ నిరసన

ఆసిఫాబాద్‌: బంగారం బ్యాంకులో పెట్టి రుణం తీసుకున్న రుణం తిరిగి చెల్లించినా తన బంగారం తనకు ఇవ్వడంలేదని మండలంలోని చిర్రకుంటకు చెందిన స్వయంసహాయక సంఘం మహిళ కామెర సునంద గురువారం జిల్లా కేంద్రంలోని ఎస్‌బీఐ ఎదుట ఆవేదన వ్యక్తం చేసింది. ఉదయం నుండి సాయంత్రం వరకు అక్కడే ఉన్నా బ్యాంకు అధికారులు తనను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేశారని వాపోయింది. రెండేళ్ల క్రితం నాలుగున్నర తులాల బంగారం బ్యాంకులో పెట్టి 1.20 లక్షలు తీసుకోగా వడ్డీతో సహా రూ.1.31 లక్షలు బుధవారం తన బ్యాంకు అకౌంట్‌ ద్వారా చెల్లించానని తెలిపింది. తన బంగారం తిరిగి ఇవ్వాలని రెండు రోజులుగా బ్యాంకు చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది.

వైద్యం వికటించి బాలుడు మృతి



ఆస్పత్రి ముందు గుమిగూడిన బంధువులు

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబ సభ్యుల ఆందోళన
- ప్రైవేట్‌ ఆస్పత్రి ముందు ఉద్రిక్తత
- ఎట్టకేలకు సద్దుమణిగిన వివాదం
- కేసు నమోదు చేసిన పోలీసులు

కాగజ్‌నగర్‌టౌన్‌: పట్టణంలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో వైద్యం వికటించి బాలుడు మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి..దహెగాం మండలం హేటిగూడ గ్రామానికి చెందిన ఎస్‌.ఓదెలు–శ్రీదేవి దంపతులకు ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఎస్‌.సాకేత్‌ (09) సంతానం. కుమారుడు దహెగాం మండలం లగ్గాంలోని సెయింట్‌ జోసఫ్‌ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. బుధవారం రాత్రి సాకేత్‌కు జ్వరం రావడంతో తండ్రి గురువారం తన ద్విచక్ర వాహనంపై కాగజ్‌నగర్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యుడు యాంటీబయాటిక్‌ ఇంజక్షన్‌ ఇవ్వాలని సూచించడంతో ఏఎన్‌ఎం బాలుడికి ఇంజక్షన్‌ ఇచ్చే క్రమంలో వాంతి చేసుకుని మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బంధువులు, కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎందుట ఆందోళనకు దిగారు. వైద్యుడి నిర్లక్ష్యం కారణంగానే తన కుమారుడు మృత్యువాత పడ్డాడని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. పట్టణ సీఐ బుద్దే స్వామి, దహెగాం ఎస్సై సనత్‌రెడ్డి, పట్టణ ఎస్సైలు కల్యాణ్‌, అంజయ్య సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. వైద్యున్ని సంప్రదించగా బాలుడి శరీరంలోని షుగర్‌ లెవల్‌ తగ్గిపోవడంతోనే మృతి చెందినట్లు వివరించాడు. పోలీసుల హామీతో ఆందోళన విరమించడంతో మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తుప్రారంభించినట్లు సీఐ బుద్దే స్వామి వివరించారు.



సాకేత్‌ (ఫైల్‌)

25న గోండుగూడకు రానున్న ట్రెయినీ కలెక్టర్లు

- ఏర్పాట్లు పరిశీలించిన పీడీ విజయలక్ష్మి

దస్తురాబాద్‌(ఖానాపూర్‌): ఆదివాసీల జీవన విధానం, వారి సంక్షేమానికి ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలు క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు ట్రెయినీ కలెక్టర్లు మండలంలోని గోండుగూడకు రానున్నట్లు డీఆర్‌డీవో పీడీ విజయలక్ష్మి తెలిపారు. వారు బస చేసేందుకు కావాల్సిన ఏర్పాట్లను గురువారం పీడీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లడుతూ ఈ నెల 25న ఆరుగురు సభ్యులతో కూడిన ట్రెయినీ కలెక్టర్ల బృందం గ్రామంలో పర్యటిస్తారని, ఆదివాసీల సమస్యలు తెలుసుకుని వారి అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై కలెక్టర్‌, జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తారని ఆమె పేర్కొన్నారు. పీడీ వెంట ఏపీడీ ప్రసాద్‌, సర్పంచ్‌ సిడాం లక్ష్మి, ఎంపీడీవో విజయ్‌ భాస్కర్‌రెడ్డి, ఎంపీవో అనిల్‌, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, తదితరులు ఉన్నారు.



గోండుగూడలో పర్యటిస్తున్న పీడీ విజయలక్ష్మి

కూరగాయల సాగును పరిశీలించిన కలెక్టర్‌

మామడ:మండలంలోని న్యూసాంగ్వి గ్రామానికి చెందిన రైతులు కోండ్ర శివారెడ్డి, రాంచందర్‌రెడ్డికి చెందిన కూరగాయల తోటలను కలెక్టర్‌ వరుణ్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ఉపాధిహామీ ద్వారా మంజూరైన నిధులను సద్వినియోగం చేసుకుని పంటచేనులో సోరకాయలు, దొండ సాగు చేస్తున్న రైతులను అభినందించారు. కూరగాయల సాగుతో వస్తున్న లాభాల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ సాగుతోపాటు కూరగాయల సాగుపై దృష్టి పెడితే ప్రత్యామ్నాయ ఆదాయం పొందవచ్చని తెలిపారు. కలెక్టర్‌ వెంట జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్‌, ఏడీ వినయ్‌బాబు, ఎంపీడీవో రమేష్‌, ఏఈవోలు సృజిత, శివకుమార్‌, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

మామడలోని సంతోష్‌నగర్‌ కాలనీ, ఎస్సీ కాలనీలలోని అంగన్‌వాడీ కేంద్రాలను కలెక్టర్‌ వరుణ్‌రెడ్డి తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి విద్యార్థుల సంఖ్య, వారికి అందించే సరుకుల వివరాలు తెలుసుకున్నారు. కేంద్రంలో విద్యార్థుల హాజరు తక్కువగా ఉండటంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల హాజరు పెంచాలని ఆదేశించారు.



చందారంలో కూరగాయల సాగును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్‌ వరుణ్‌రెడ్డి

బాసర వరకు తిరుపతి రైలు..!

- సూపర్‌ ఫాస్ట్‌ పొడిగింపునకు ప్రతిపాదన

భైంసా(ముథోల్‌): ప్రస్తుతం తిరుపతి నుండి కరీంనగర్‌ వరకు నడుస్తున్న బై వీక్లీ సూపర్‌ ఫాస్ట్‌ ఎక్స్‌ప్రెస్‌ రైలును నిర్మల్‌ జిల్లా బాసర వరకు పొడిగించాలని దక్షిణ మధ్య రైల్వే జోన్‌ అధికారులు రైల్వే బోర్డుకు ప్రతిపాదనలు పంపించారు. రైల్వే బోర్డు కూడా ఇందుకు సూత్రప్రాయంగా అంగీకారం తెలిపినట్లు సమాచారం. 1271/62 బై వీక్లీ సూపర్‌ ఫాస్ట్‌ రైలు ప్రస్తుతం తిరుపతి నుండి కరీంనగర్‌ వరకు నడుస్తోంది. తిరుపతి నుండి కరీంనగర్‌ బై వీక్లీ సూపర్‌ ఫాస్ట్‌ ఎక్స్‌ ప్రెస్‌ రైలును బాసర వరకు పొడిగిస్తే అటు తిరుమల వెంకటేశ్వర స్వామి క్షేత్రాన్ని ఇటు బాసర సరస్వతి అమ్మవారి క్షేత్రముతో అనుసంధానం చేసినట్లు అవుతుంది. పైగా బాసర నుండి తిరుపతి వయా పెద్దపల్లి–నిజామాబాద్‌–కాజీపేట టౌన్‌–విజయవాడ దగ్గరి మార్గం. ప్రస్తుతం నడుస్తున్న కృష్ణాఎక్స్‌ ప్రెస్‌తో పోలిస్తే ఈ మార్గం కొంచెం దగ్గరగా అవుతుంది.

ఉమ్మడి జిల్లాకు సౌకర్యంగా..

ఉమ్మడి ఆదిలాబాద్‌లోని సిర్పూర్‌ కాగజ్‌నగర్‌, ఆసిఫాబాద్‌ రోడ్డు, బెల్లంపల్లి, మందమర్రి, రవీంద్రఖని, మంచిర్యాల ప్రయాణికులు ఉదయం సికింద్రాబాద్‌ వెళ్లే ప్రయాణికులు, భాగ్యనగర్‌ ఎక్స్‌ప్రెస్‌ రైలుకు వచ్చే యాత్రికులు పెద్దపల్లి జంక్షన్‌లో దిగి 12761 రైలులో కరీంనగర్‌ నుండి బాసరకు వెళ్ళే అవకాశం ఉంటుంది.

సరస్వతీ ఎక్స్‌ప్రెస్‌గా...

తిరుపతి నుండి కరీంనగర్‌ బై వీక్లీ సూపర్‌ ఫాస్ట్‌ ఎక్స్‌ప్రెస్‌ రైలును బాసర వరకు పొడిగించిన తరువాత అదనంగా 3 రోజులు పెంచాలి. ఈ రైలు పేరును 'సరస్వతి' ఎక్స్‌ప్రెస్‌గా నామకరణం చేయాలన్న ప్రతిపాదన ఉంది. ఆదిలాబాద్‌ ఎంపీ సోయం బాపురావు ఈ రైలు పొడిగింపు విషయంలో రైల్వే మంత్రి అశ్వినివైష్ణవ్‌, సహాయమంత్రి రావుసాహెబ్‌ దన్వే పాటిల్‌ను కలిస్తే ఈ ప్రతిపాదనలకు త్వరగా ఆమోదం లభించే అవకాశం ఉందని రైల్వేవర్గాలు పేర్కొంటున్నాయి.



బాసర రైల్వే స్టేషన్‌

రెండో ఏఎన్‌ఎంలకు 'ఈటల' మద్దతు

నిర్మల్‌: ప్రజలకు తమ సేవలను అందిస్తున్న రెండో ఏఎన్‌ఎంల సమస్యలు, డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీజేపీ ఎన్నికల కమిటీ చైర్మన్‌ ఈటల రాజేందర్‌ డిమాండ్‌ చేశారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేస్తున్న రెండో ఏఎన్‌ఎంలకు తన మద్దతు ప్రకటించారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అయ్యన్నగారి భూమయ్య, రావుల రాంనాథ్‌, రమాదేవి, రామారావ్‌ పటేల్‌, డా.మల్లికార్జున్‌రెడ్డి, సామ రాజేశ్వర్‌రెడ్డి, చిట్యాల సుహాసినిరెడ్డి, హరినాయక్‌, జానుబాయి, తదితరులు పాల్గొన్నారు.



మద్దతు ప్రకటిస్తున్న రాజేందర్‌

నేడు స్వదేశానికి చేరనున్న మృతదేహం



రమేష్‌(ఫైల్‌)

సారంగపూర్‌(నిర్మల్‌): మండలంలోని కౌట్ల(బి) గ్రామానికి చెందిన బెజ్జారం రమేశ్‌ (34) ఈ నెల 5న దుబాయ్‌లో బీచ్‌వద్ద ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందిన విషయం తెలిసిందే. మృతదేహాన్ని శుక్రవారం స్వగ్రామానికి పంపించే ఏర్పాట్లు చేశామని ప్రవాసి మిత్ర లేబర్‌ యూనియన్‌ అధ్యక్షుడు స్వదేశ్‌ పరికిండ్ల గురువారం మీడియాకు వెల్లడించారు. ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక అంబులెన్స్‌ ద్వారా మృతదేహాన్ని కౌట్ల(బి) గ్రామానికి రప్పించడానికి తెలంగాణ రాష్ట్ర జనరల్‌ అడ్మినిస్ట్రేటివ్‌ అధికారి ఈడిగె చిట్టిబాబు ద్వారా ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

గుండెపోటుతో రేషన్‌ డీలర్‌ మృతి

బేల: మండల కేంద్రంలోని చౌకధరల దుకాణం నం. 2కు చెందిన రేషన్‌ డీలర్‌ కాంబ్లే వికాస్‌ (26) గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. స్థానిక అంబేద్కర్‌ కాలనీకి చెందిన వికాస్‌ రోజువారీలా వాకింగ్‌ వెళ్లి ఇంటికి తిరిగి వచ్చి స్నానం చేసే క్రమంలో అకస్మాత్తుగా వాంతులు చేసుకుని స్పృహ కోల్పోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108లో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు



గాయాలపాలైన కొడప పవన్‌

గుడిహత్నూర్‌ (బోథ్‌): మండలంలోని పూనగూడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్రగాయాలు కాగా ఒకరి పరిస్థితి ఆందోళన కరంగా ఉన్నట్లు స్థానికులు, పోలీసులు తెలిపారు. మండల కేంద్రంలోని జవహర్‌నగర్‌కు చెందిన గెడం మారుతి చింతగూడకు చెందిన ఓ ట్రాక్టర్‌ యజమాని వద్ద కూలీ పని చేస్తున్నాడు. తన స్నేహితుడు ఇచ్చోడ మండలం తలమద్రికి చెందిన కొడప పవన్‌తో కలిసి గురువారం తన అత్తగారి ఊరైన ఇంద్రవెల్లి మండలంలోని మెండపల్లికి బైక్‌పై బయలు దేరారు. తోషం సమీపంలో నిలిచి ఉన్న బొలెరో వాహనాన్ని వెనుక నుండి ఢీకొట్టారు. ఘటనలో పవన్‌కు తీవ్రంగా మారుతికి స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

పురుగుల మందుతాగి ఒకరు ఆత్మహత్య



డిగంబర్‌(ఫైల్‌)

గుడిహత్నూర్‌(బోథ్‌): పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ఇమ్రాన్‌ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ముత్నూర్‌ గ్రామానికి చెందిన నాగర్‌గోజే డిగంబర్‌ (43) తనకున్న నాలుగెకరాల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల తన సోదరుడు దత్తా వద్ద నుంచి ఎకరా పొలాన్ని రూ.10లక్షలు వెచ్చించి కొనుగోలు చేశాడు. అతనికి ఇవ్వాల్సిన డబ్బులు సకాలంలో అందకపోవడంతో మానసిక ఒత్తిడికి గురయ్యాడు. బుధవారం రాత్రి మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఇంటికివచ్చి కుటుంబ సభ్యులతో చెప్పాడు. వెంటనే కుటుంబ సభ్యులు రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య అయోధ్యాబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కడుపునొప్పి భరించలేక యువకుడు...



స్వామి (ఫైల్‌)

తలమడుగు(బోథ్‌): కడుపునొప్పి భరించలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఆర్లీ (కే) గ్రామానికి చెందిన దాసరి స్వామి (26)కి బుధవారం రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో కడుపునొప్పి రావడంతో బాధ భరించలేక ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం తెల్లవారుజామున కుటుంబ సభ్యులు చూసేసరికి మృతి చెంది ఉన్నాడు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై ధనశ్రీ తెలిపారు.



సాక్షి క్లాసిఫైడ్స్‌

REAL ESTATE

FLAT FOR SALE

Badangpet-Nadargul HMDA Approved 2 & 3BHK Luxury Flats, Flash Lauching Offer only 3 Days, Pay only 50% Now & Balance after 1 year with Amenities. Ph: 8008638238. [HA-515]

PLOT FOR SALE

శరవేగంగా అభివృద్ధి చెందుతున్న బెంగుళూరు హైవే తిమ్మాపూర్‌, కొత్తూరు, నందిగామ ఇళ్ళమధ్యలో HMDA వెంచర్‌లో కే॥ 15 లక్షలకే ప్లాట్‌ సొంతం లోన్‌ సౌకర్యం కలదు.(ఏజెంట్లు కావలెను) 9052254789. [HA-788519]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌ / డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462